క్లుప్తంగా

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్కాములు జరిగాయని, పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమాభివృద్ధి కోసం బృహత్తర స్కీములను అమలు చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం సింగాపూర్ గ్రామంలోని ఆయన నివాస గృహంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడిన విధానం సరికాదన్నారు. రాజకీయ ఉనికిని చాటుకునేందుకు పదేపదే కాంగ్రెస్ నాయకులపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. ఎన్నికల వేళ బ్లాక్‌మెయిల్ చేసి గెలిచారని, పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. తప్పుడు వ్యాఖ్యలతో పబ్బం గడిపే ఎమ్మెల్యేకు ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ జర్నలిస్టులకు పంపిణీ చేసిన నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, పోతరాజు సంపత్, వేల్పుల సునీల్ ఉన్నారు.

ఆది శ్రీనివాస్‌కు సన్మానం

జమ్మికుంట: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఫంక్షన్ నిమిత్తం జమ్మికుంటకు తొలిసారి విచ్చేసిన సందర్భంగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పొనగంటి మల్లయ్య, జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, కౌన్సిలర్లు పొనగంటి రామూర్తి, మేడిపల్లి రవీందర్, సారంగం, ధర్మారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, నాయకులు అకుల నారాయణ, కామిశెట్టి మల్లయ్య, పొనగంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని సిద్ధార్థకాలనీలో పీవీ సేవాసమితి ఆధ్వర్యంలో ఐఎంఎం వైద్యులతో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎస్‌ఐ అహ్మద్ ఆలీ హాజరై మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు రామలింగారెడ్డి, తొగరు విద్యాసాగర్, మెడికల్ షాపు యజమాని దొండ నాగరాజు, పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం

హుజూరాబాద్‌రూరల్: ఆచరణకు సాధ్యం కాని ఆరు గ్యారంటీ హామీలను ఎన్నికల ప్రచారంలో ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయటంలో విఫలమైందని హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వొడితల ప్రణవ్ స్థాయి మరిచి విమర్శలు చేయటం సరికాదన్నారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు డాక్టర్ సంఘం ఐలయ్య, నాయకులు దాసరి రమణారెడ్డి, పోరెడ్డి దయాకర్‌రెడ్డి, సంగం సత్యనారాయణ తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి: నేతన్న సబ్సిడీ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.37.49కోట్ల బకాయిలు విడుదల చేయడంతోపాటు నూలు, రంగు రసాయనాలు కొనుగోలులో 40 శాతం సబ్సిడీ ఇవ్వడంపై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానంపురం చందు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని చేనేత సహకార సంఘంలో పవర్‌లూం, చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, అనుమాండ్ల నర్సయ్య, ఎన్నం మునిందర్, ఎలిగేటి తిరుపతి, వల్లాల కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

గంగాధర: గంగాధర గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ ఎస్సైగా ఉద్యోగం సాధించి ధర్మపురిలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం గ్రూప్ వన్ ప్రిపరేషన్ కోసం సెలవులో ఉన్నారు. తన కూతురు జన్మదినం సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన ఉదయ్.. శనివారం పాఠశాలలో 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. హెచ్‌ఎం అనిత, పీడీ బాబుశ్రీనివాస్, రాజేశ్వర్, రఘురాం, చంద్రమౌళి, ఈశ్వర్, శ్రీనివాస్, ప్రతిభ, నిఖిత, యాస్మిన్, పులిచర్ల సౌమ్యశ్రీ, తార, శశికిరణ్, లాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత సాగుతో మంచి దిగుబడులు



రామడుగు: పత్తి పంటను అధిక సాంద్రత పద్ధతి ద్వారా సాగు చేస్తే మంచి దిగుబడులను సాధించే అవకాశముంటుందని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం మేజ్ సెంటర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ మంజులత తెలిపారు. వెదిరలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట ఆధ్వర్యంలో జాతీయ ప్రతి పరిశోధన సంస్థ సహకారంతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు విధానంపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు.

పోలీస్ స్టేషన్ సందర్శించిన ఏసీపీ



ఇల్లందకుంట: హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి శనివారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ మట్లాడుతూ.. కేసులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. జమ్మికుంట రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కిషోర్, ఎస్సై రాజ్‌కుమార్, ఎస్‌ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి గదులు ప్రారంభం



తిమ్మాపూర్: మహాత్మానగర్ పంచాయతీ పరిధిలోని తాపాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన 3అతిథి గదులను శనివారం ప్రారంభించారు. పోరండ్లకు చెందిన దాతలు విజేందర్, బాలకిషన్‌రావు, రంగారావు నిర్మించారు. వీటిని ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి దాతలతో కలిసి ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు తిరునగిరి వెంకటాద్రి స్వామి, చేపూరి వేణుగోపాలరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం.. మహా పరివర్తనకు మార్గం

- విడుదలైన ఖైదీలకు జీవనోపాధి.. ఆర్థిక భరోసా
- లాభాల బాటలో జైలు పెట్రోలు బంకులు
- నెలకు రూ.3లక్షల ఆదాయం
- రిలీజ్, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఉపాధి


హుజూరాబాద్ సబ్ జైలు ఎదుట ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు

హుజూరాబాద్‌రూరల్: క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దడానికి నేరస్తులకు జైలు శిక్ష విధిస్తుంటారు. అక్కడ ఖైదీలకు కఠోరమైన శిక్షలు విధించేవారు. ఇదంతా గతం. ప్రస్తుతం తెలంగాణ జైళ్ల శాఖ పలు సంస్కరణలు అమలు చేస్తుండటంతో ఆ పరిస్థితి మారింది. సత్ప్రవర్తనతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారికి జీవితంపై నమ్మకం కలిగించేలా భరోసా కల్పిస్తుండటం విశేషం. శిక్ష అనుభవిస్తూనే మరోవైపు వివిధ రంగాల్లో ఉపాధి పొందేలా చర్యలు చేపట్టింది. వారి భవితలకు బాటలు వేస్తోంది. హుజూరాబాద్ జైలు ఈ దిశగా అడుగులు వేస్తోంది. సబ్ జైలు ముందు పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఖైదీల ఉపాధికి ఊతం ఇచ్చి మహా పరివర్తనకు మార్గం చూపుతున్న వైనంపై కథనం.

నూతన బంక్ ఏర్పాటు

జైళ్ల శాఖ వనరుల నుంచి హుజూరాబాద్ సబ్ జైలు ముందు జూలై 3న జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, డీఐజీ ఎం.సంపత్, డీఎస్‌జీవో శ్రీనివాస్ పెట్రోలు బంకును ప్రారంభించారు. ఈ బంక్‌లో ఇచ్చే ఇంధనం నాణ్యతగా ఉంటుందన్న పేరు రావడంతో వాహనదారులు బంక్ ఎదుట క్యూ కడుతున్నారు. వాహనాల్లో గాలి నింపే వసతి సైతం కల్పించారు. ఇది సత్ఫలితాలివ్వడంతోపాటు జైళ్ల శాఖకు ఆదాయం సమకూరుతోంది.

అరమరికలు లేకుండా..

ఈ పెట్రోల్ బంక్‌లో పది మంది రెండు విడతల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఒక్కొక్కరికి నెలకు రూ.15వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. బంకులో పని చేసే ఖైదీలు ఎలాంటి అరమరికలు లేకుండా పని చేస్తున్నారు. జైలు అధికారులు ఎప్పటికప్పుడు చొరవ చూపుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా లావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. బంకుల్లో పగలు, రాత్రి పోలీస్ కానిస్టేబుళ్ల పర్యవేక్షణ ఉంటుంది. ప్రారంభించిన నాలుగు నెలల్లోనే సుమారు నెలకు 60వేల లీటర్ల పెట్రోలు, 50వేల లీటర్ల డీజిల్ సేలవడంతో జైల్ శాఖకు నెలకు సుమారు రూ.3లక్షల ఆదాయం సమకూరుతోంది. ఇప్పటివరకు పది మంది ఖైదీలు ఉపాధి పొందినట్లు జైలు అధికారులు పేర్కొంటున్నారు.

ఆర్థిక భరోసా



జైలు నుంచి విడుదలైన నాకు బయట ఉపాధి దొరకాలంటే ఇబ్బందిగా మారింది. మా బాధలను అర్థం చేసుకొని పెట్రోల్ బంకును ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కల్పించారు. ఇందులో పని చేస్తుండటంతో ఆర్థిక భరోసా ఏర్పడుతోంది. సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్న.

– బీట్ల చిరంజీవి, పెట్రోల్ బంక్ వర్కర్, జమ్మికుంట

మంచి మైలేజ్



సైదాపూర్ రోడ్‌లోని పెట్రోల్ బంకులో లీటర్ పెట్రోల్ కొట్టిస్త. పెట్రోల్ నాణ్యత ప్రమాణాలు ఎక్కువగా ఉండటంతో బండి మంచి మైలేజ్ ఇస్తంది. పెట్రోల్ తప్పనిసరిగా ఇక్కడే కొట్టిస్తున్న. బయటి బంకులతో పోల్చుకుంటే ఈ బంక్ చాలా బెటర్.

– కుడికాల రమేశ్, వినియోగదారుడు, హుజూరాబాద్

స్వయం ఉపాధి కల్పన



జైళ్ల శాఖలో పలు సంస్కరణల్లో భాగంగా హుజూరాబాద్ సబ్ జైల్ ఆవరణలో బంక్‌ను ఏర్పాటు చేశాం. బెయిల్‌పై, రిలీజ్‌పై వచ్చిన ఖైదీలకు అండగా నిలుస్తున్నాం. వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నాంపల్లి దేవేందర్, జైలు సూపరింటెండెంట్, హుజూరాబాద్



శంకరపట్నం: మండలంలో రహదారులపై రైతులు ధాన్యం ఆరబోస్తున్నారు. కన్నాపూర్–ముత్తారం, ఆముదాలపల్లి–మెట్‌పల్లి, రాజాపూర్– కాచాపూర్, మొలంగూర్–వీణవంక రోడ్లపై ధాన్యం కుప్పలు ఆరబోస్తుండడంతో.. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో రోడ్డుపై ధాన్యం కుప్ప పోయడంతో రాత్రి సమయంలో పాల ఆటో బోల్తా పడిన విషయం తెలిసిందే. ప్రమాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవి, ఎస్సై, కేశవపట్నం, సెల్ నం.: 8712670774

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

తహసీల్ కార్యాలయానికి మంత్రి పొన్నం

తిమ్మాపూర్: తహసీల్ కార్యాలయానికి శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ వచ్చారు. కరీంనగర్ నుంచి చిగురుమామిడి పర్యటనకు వెళ్తున్న క్రమంలో ఉదయం 10గంటలకు తిమ్మాపూర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడే 20 నిమిషాలు వేచి ఉన్నారు. తహసీల్దార్ రాకపోవడంతో ఎందుకు రాలేదని సిబ్బందిని అడిగారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ ఉండడంతో అక్కడే ఉన్నారని సిబ్బంది తెలిపారు. దీంతో ఎమ్మెల్యే సత్యనారాయణ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మార్వో చాంబర్‌లో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మంత్రి తన కారులోనే అల్పాహారం చేశారు. తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ మంత్రిని కలిసి ఈనెల 29న పాఠశాలలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్‌కు రావాలని ఆహ్వాన పత్రం అందించారు.

భూములు కోల్పోతున్న రైతులు సహకరించాలి


భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

చిగురుమామిడి: గౌరవెల్లి ప్రాజెక్టు కింద మైనర్, సబ్ మైనర్ కాలువల కింద భూములు కోల్పోతున్న రైతులు మీ అభిప్రాయాలు ఏమిటో చెప్పాలని, అవసరమైతే మళ్లీ మీ భూముల వద్దకు వచ్చి కొలతలు వేయడంతోపాటు భారీగా నష్టం జరుగుతుందంటే అలైన్‌మెంట్ మార్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్ అన్నారు. శనివారం చిగురుమామిడి రైతు వేదికలో చిగురుమామిడి రెవెన్యూ పరిధిలోని లంబాడిపల్లి, పీచుపల్లి, సీతారాంపూర్, చిగురుమామిడి గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. నాలుగు గ్రామాల 200 మంది రైతులకు చెందిన 64 ఎకరాల వ్యవసాయ భూములు కాలువ కింద కోల్పోతున్నట్లు చెప్పారు. పలువురు రైతులు ఉన్న కొద్దిపాటి భూమిలో నుంచి కాలువ పోతే ఎట్లా బతికేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడిపల్లికి చెందిన నల్లాల రవి రెండెకరాల వ్యవసాయ భూమి మధ్యలో నుంచి కాలువ పోతోందన్నారు. ఐరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. కాలువ కింద పోయేది ఎంత, తమకు ఉండేది ఎంతనే స్పష్టత ఇవ్వడం లేదని, దాంతో రైతుల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. నాగెల్లి కళావతి పేరున ఉన్న 17 గుంటల్లోంచి కెనాల్ పోతోందని, బతుకుదెరువు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేసింది. మరికొందరు రైతులు అధికారుల ముందు పలు కారణాలు చెప్పారు. ఆర్డీవో మాట్లాడుతూ.. మీకున్న అనుమానాలను స్పష్టంగా చెబితే ప్రత్యామ్నాయ మార్గాలను కనుక్కోంటామన్నారు. తహసీల్దార్ ఎం.రమేశ్, ఆర్‌ఐ సంతోష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు రజని, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి

జమ్మికుంట: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కలకోట అఖిల్, సందేశ్, సిద్దిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర: సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాచకొండ రాజేశ్, శివగణేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు నగదురహిత వైద్య సేవలకు కృషి


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

జమ్మికుంట: ప్రైవేటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని ఆసుపత్రుల్లో నగదురహిత వైద్య సేవలందించేలా కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూత్ నాయకులతో బైక్ ర్యాలీ చేసి అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేశారు. పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కనీస వేతనమందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రతి పట్టభద్రుడు నవంబర్ 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యూత్ నాయకులు కొండ అర్జున్, చిరంజీవి, రత్నాకర్, సుమంత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి: పట్టణ కేంద్రానికి చెందిన పలువురు క్రీడాకారులు తైక్వాండో చాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ 17 సంవత్సరాల లోపు విభాగంలో గీతా విద్యాలయానికి చెందిన విద్యార్థులు బి.వెంకటేశ్ గోల్డ్ మెడల్ సాధించగా, ఎ.సౌమ్య, పి.ఎంజెల్, ఎస్.స్పందన కాంస్య పతకాలు సాధించారు.

రామడుగు: రామడుగు మోడల్ స్కూల్‌లో చదువుతున్న మామిడి సంజీవ్(ఇంటర్ ప్రథమ సంవత్సరం), రాగం ఈశ్వర్(పదోతరగతి) ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–17 జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తెలిపారు. ఎంఈవో వేణుకుమార్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు దీప, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ సభ్యత్వ నమోదు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని 74వ బూత్‌లోని గణేశ్‌నగర్‌లో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలున్నారు.

గన్నేరువరం: జంగపల్లి గ్రామంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు నాయకుడు సొల్లు అజయ్‌వర్మ తెలిపారు.

పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

హుజూరాబాద్‌రూరల్: తుమ్మనపల్లి గ్రామంలోని ఏకశిల పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ హాజరై వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆరోపణలు మానుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చిల్లర ఆరోపణలు చేస్తే సహించేది లేదని యువజన రాష్ట్ర నాయకుడు సందమల్ల నరేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కమిషనర్‌కు వినతి

హుజూరాబాద్‌రూరల్: వనపర్తి జిల్లా కొత్తపేటలో వార్డు ఆఫీసర్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు.

నూతన నియామకం

మానకొండూర్: బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ నియోజకవర్గ కన్వీనర్‌గా చెంజర్ల గ్రామానికి దూడూరి సురేశ్‌ను నియమిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జక్కని సంజయ్‌కుమార్, జిల్లా కన్వీనర్ చలకమారి శ్రీనివాస్‌కు సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న జీడి రవితేజను టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమిస్తూ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ ప్రథమ సంవత్సర ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.

సేంద్రియ ఎరువులను వాడుదాం..

ఇల్లందకుంట: రైతులు పండించే పంటలకు విషపూరితమైన పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులను వాడి ప్రజల ఆరోగ్యాలతోపాటు పర్యావరణాన్ని కాపాడాలని బీసీఐ ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ మల్లేశ్ అన్నారు. శనివారం శ్రీరాములపల్లి గ్రామంలో నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో విషపూరిత పురుగు మందులు వాడడంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

క్రైం కార్నర్..

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు: రుద్రారం, చిప్పకుర్తి గ్రామాల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.శేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మోతె వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నింపుకొని వెళ్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇద్దరికి 14 రోజుల రిమాండ్

శంకరపట్నం: బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి హుజూరాబాద్ న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్ ఈనెల 24న రాత్రి ఇంటి వద్ద గొడవ జరుగుతోందని 100 నంబర్‌కు డయల్ చేశాడు. కేశవపట్నం పోలీస్ స్టేషన్ బ్లూకోల్ట్స్ పోలీసులు లతీఫ్, సదానందం చేరుకున్నారు. శ్రీనివాస్ ఇంటి ముందు ఎలాంటి గొడవ లేకపోవడంతో వీడియో చిత్రీకరిస్తున్న పోలీసుల విధులకు గొల్లెన శ్రీనివాస్, మేరుగు పవన్ ఆటంకం కలిగించారు. శనివారం హుజూరాబాద్ కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి అలేఖ్య ఇద్దరికి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో కోళ్ల మృత్యువాత

శంకరపట్నం: కాచాపూర్ గ్రామంలో శనివారం కుక్కల దాడిలో నాటు కోళ్లు చనిపోవడంతో గ్రామ పంచాయతీ ముందు సదరు రైతు నిరసన తెలిపాడు. బాధితుడి వివరాల ప్రకారం.. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా కచాపూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల అశోక్ ఇంటి ఆవరణలో మూడేళ్ల క్రితం నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఇప్పటివరకు 60 నుంచి 70 వరకు నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. ఇటీవల వరుసగా అశోక్ పెంచుతున్న నాటు కోళ్లపై కుక్కలు దాడి చేసి వరుసగా 16 కోళ్లు, 11 కోళ్లు, 6 కోళ్లు, 4 కోళ్లను చంపివేశాయి. పలు దఫాలు కార్యదర్శికి ఫిర్యాదు చేశాడు. శనివారం నాటు కోళ్లపై మూడు కుక్కలు దాడి చేసి కోడిని చంపేశాయి. చినపోయిన కోడిని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు వేసి నిరసన తెలిపాడు. కార్యాలయంలో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో గ్రామంలోని వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసి ఆందోళన వ్యక్తం చేశాడు. కోళ్లపై కుక్కలు దాడి చేయకుండా అధికారులు పట్టించుకోవాలని కోరాడు.

కారును ఢీకొట్టిన ట్రాక్టర్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో తహసీల్ కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. మద్యం తాగి వస్తున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్ కారును ఎదురుగా ఢీకొట్టడంతో.. కారు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కంచెను తాకి ఆగింది. ఎవరికి గాయాలు కాలేదు.

పేకాట స్థావరంపై దాడులు

హుజూరాబాద్‌రూరల్: రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. 9 మంది పేకాట ఆడుతుండగా.. ఐదుగురు పరారైనట్లు తెలిపారు. నలుగురి వద్ద నుంచి రూ.11,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ముదిరాజ్‌లపై చర్యలు తీసుకోవాలి

గన్నేరువరం: చీమలకుంటపల్లె ముదిరాజ్‌లపై చర్యలు తీసుకోవాలని గునుకులకొండాపూర్ గ్రామ ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. గునుకులకొండాపూర్‌లో మల్లికార్జున కుంట చెరువు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. 2020లో రెండు గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఒప్పందం మేరకు ఈ కుంటలో చేపలు పెంపకం చేపడుతున్నామని, ఇందులో భాగంగా ఈనెల 15న సంబంధిత కుంటలో 50వేల విలువ గల చేప పిల్లలు వేసినట్లు తెలిపారు. ఇదే చెరువులో చీమలకుంటపల్లె ముదిరాజ్‌లు 25న చేపలు పోసినట్లు చెబుతూ ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గూడెల్లి మల్లేశం, చొక్కాల కొండయ్య, చొక్కాల బుచ్చయ్య, చొక్కాల నర్సయ్య, బల్ల బాలరాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సేవలు మెరుగుపరుస్తాం

చొప్పదండి: పట్టణంలో పారిశుద్ధ్య సేవలను మెరుగుపరుస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. ఆమె అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు తీర్మానాలు చేసినట్లు వివరించారు.